# పారిశ్రామిక దేశాల గ్రూప్... జీ-8

**ప్రపంచంలో అత్యంత పారిశ్రామికాభివృద్ధి సాధించిన దేశాల సమూహమే.. గ్రూప్-8. జీ-8 బాగా శక్తివంతమైన ప్రభావశీల దేశాల గ్రూప్. ఐక్య రాజ్యసమితి, ప్రపంచ బ్యాంకులా ఇది అంతర్జాతీయ సంస్థ కాదు. అంతర్జాతీయ అంశాలను సహకార ధోరణిలో చర్చించే వేదిక మాత్రమే! దీనికి ప్రత్యేక పాలనా వ్యవస్థ, ప్రధాన కార్యాలయం, శాశ్వత సిబ్బంది, బడ్జెట్ వ్యవహారాలు ఏమీ లేవు. విదేశీ వ్యవహారాలు, ఆర్థికాంశాలు, వాణిజ్యం, భద్రత, వాతావరణం, వ్యవసాయం, కార్మిక సమస్యలు వంటి వాటిపై చర్చలే జీ-8 సదస్సుల ప్రధాన అజెండా!** **ప్రపంచంలో అత్యంత పారిశ్రామికాభివృద్ధి సాధించిన దేశాల సమూహమే.. గ్రూప్-8. జీ-8 బాగా శక్తివంతమైన ప్రభావశీల దేశాల గ్రూప్. ఐక్య రాజ్యసమితి, ప్రపంచ బ్యాంకులా ఇది అంతర్జాతీయ సంస్థ కాదు. అంతర్జాతీయ అంశాలను సహకార ధోరణిలో చర్చించే వేదిక మాత్రమే! దీనికి ప్రత్యేక పాలనా వ్యవస్థ, ప్రధాన కార్యాలయం, శాశ్వత సిబ్బంది, బడ్జెట్ వ్యవహారాలు ఏమీ లేవు. విదేశీ వ్యవహారాలు, ఆర్థికాంశాలు, వాణిజ్యం, భద్రత, వాతావరణం, వ్యవసాయం, కార్మిక సమస్యలు వంటి వాటిపై చర్చలే జీ-8 సదస్సుల ప్రధాన అజెండా!**

2009 జీ–8 సదస్సు ఇటలీలోని లాక్విలాలో జూలై 8 నుంచి 10 వరకు జరిగింది. ఇటలీ సదస్సు అజెండాలో.. ప్రపంచ ఆర్థిక మాంద్యం; వాణిజ్య రక్షణ విధానాలపై వ్యతిరేక పోరాటం; అంతర్జాతీయ వాణిజ్యం ప్రతి ఒక్కరికీ మేలు చేసేలా చర్యలు తీసుకోవడం;ప్రాంతీయ సమస్యల పరిష్కారం; ఆహార భద్రత; వాతావరణ మార్పులు ప్రధానంగా చోటుచేసుకున్నాయి. ఈ సదస్సుకు ఓ ప్రత్యేకత ఉంది. అదేమంటే.. జీ–8 దేశాలు, ఆఫ్రికా, అభివృద్ధిచెందుతున్న దేశాలతో పాటు అంతర్జాతీయ సంస్థలు పాల్గొనడం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దాదాపు 90 శాతం సదస్సుకు హాజరవడం మరో విశేషం.

## చమురు సంక్షోభం... జీ–8కు నాంది:

1973 నాటి చమురు సంక్షోభం, తదనంతర ప్రపంచ ఆర్థిక మాంద్యం.. గ్రూప్–7 ఏర్పాటుకు దారితీసింది. జీ–7 దేశాల తొలి సమావేశం 1975లో ఫ్రాన్స్‌లో జరిగింది. 1997, జూన్‌లో రష్యా కూడా వచ్చి చేరడంతో జీ–7, జీ–8గా మారింది. బోస్నియా సమస్య పరిష్కారం, నాటో తూర్పు దిశగా విస్తరించకుండా సహకరించినందుకు రష్యాకు సభ్యత్వం లభించింది.

## జీ–8 సభ్యదేశాలు:

అమెరికా,యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, కెనడా, రష్యా. చమురు ధరల స్థిరీకరణ, సురక్షిత సరఫరా గురించే జీ–8 దేశాలు ఎక్కువగా ఆందోళన చెందుతున్నాయని విశ్లేషకుల అభిప్రాయం. చమురు సరఫరా కోసం ఆర్గనైజేషన్ ఆఫ్ పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్(ఓపీఈసీ)పై ఆధారపడటాన్ని జీ–8 దేశాలు తగ్గించుకుంటున్నాయి. ఇవి తాజాగా తమ ఇంధన అవసరాల కోసం రష్యాపై అధికంగా

ఆధారపడుతున్నాయి. రష్యా చమురు ఉత్పత్తిలో మూడొంతులు జీ-8 దేశాలకే సరఫరా అవుతోంది. చమురు, గ్యాస్ ఎగుమతుల ద్వారా ఆర్జించిన ఆదాయంతో రష్యా ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోంది.

## జీ-8+5:

భారత్, చైనా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, మెక్సికోలను భాగస్వామ్య దేశాల హోదాలో జీ-8 వార్షిక సమావేశాలకు ఆహ్వానిస్తున్నారు. వీటిని అవుట్ రీచ్ కంట్రీస్ (ఓ-5)గా పేర్కొంటున్నారు. ఈ ఐదు దేశాలు అంతర్జాతీయ అంశాలపై పారిశ్రామిక దేశాలతో విస్తృత చర్చలు జరిపేందుకు వీలుగా ఈ ఏర్పాటు చేశారు. 2005లో స్కాట్లాండ్‌లోని గ్లెనెంగ్లస్‌లో జీ-8 సదస్సు సందర్భంగా ఓ-5 ఏర్పాటైంది. జీ-8, ఓ-5ల మధ్య శాశ్వత ప్రాతిపదికన చర్చలను కొనసాగించేందుకే హెలిజెండమ్ ప్రక్రియ ప్రారంభించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ, ఓ-5 ప్రతిపాదన చేశారు. పారిశ్రామిక దేశాలుగా అభివృద్ధి చెందుతున్న ఈ దేశాలు జీ-8 సభ్య దేశాలు కావాలని సూచించారు. జీ-8 విస్తరణకు అమెరి కా, జపాన్ వ్యతిరేకంగా, బ్రిటన్ అనుకూలంగా ఉన్నాయి.

## జీ-8 లక్ష్యం:

అంతర్జాతీయంగా మరింత ఆర్థిక స్థిరత్వం, సహకారం సాధించేందుకు వీలుగా.. పారిశ్రామిక దేశాధినేతల మధ్య ఏకాభిప్రాయసాధనే జీ-8 ముఖ్యలక్ష్యం. తొలుత జీ-8 ఆర్థికాంశాలపైనే దృష్టి సారించింది. 1983లో అమెరికాలో జరిగిన సదస్సు తర్వాత రాజకీయ డిక్లరేషన్‌ను కూడా చేర్చారు. రొటేషన్ ప్రాతిపదికన ప్రతి ఏటా సభ్యదేశాల్లోని ఒక దేశం జీ-8కు నేతృత్వం వహిస్తుంది. వరుసగా ఫ్రాన్స్, అమెరికా, బ్రిటన్, రష్యా, జర్మనీ, జపాన్, ఇటలీ, కెనడా.. జీ-8 అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తాయి. సదరు సభ్యదేశం జనవరి 1న అధ్యక్ష బాధ్యతలు చేపడుతుంది. అధ్యక్ష స్థానంలో ఉన్న దేశం పలు అంశాలపై సమావేశాలు జరుపుతూ.. సంవత్సరం మధ్యలో మూడు రోజులపాటు దేశాధినేతల సద స్సు నిర్వహిస్తుంది.

## సదస్సులు.. విమర్శలు:

జీ-8 సదస్సుల సందర్భంగా గ్లోబలైజేషన్ వ్యతిరేక ప్రదర్శనలు జరగడం ఇటీవల పరిపాటిగా మారుతోంది. భూతాపం, ఆఫ్రికాలో పేదరికం, అసమతుల్య వాణిజ్య విధానాలు వంటి అంతర్జాతీయ సమస్యలకు మూలకారణం ప్రపంచీకరణే అనే విమర్శలు వస్తున్నాయి. జీ-8 దేశాలు అందించే అరకొర విదేశీసాయం పైనా అసంతృప్తి వ్యక్తమవుతోంది. 1992లో జరిగినఎర్త్ సమిట్ అజెండా 21 ప్రకారం జీ-8 దేశాలు తమ జీడీపీలో కనీసం 0.7 శాతం విదేశీ సాయానికి కేటాయించాలి. ఇటీవల కాలంలో... జీ-8 సదస్సుల సందర్భంగా ప్రసారమాధ్యమాల సందడేతప్ప; ఆర్థిక, రాజకీయ పురోగతి లేదనే విమర్శలున్నాయి.

## 2009 సదస్సు.. అజెండా:

- అంతర్జాతీయ శాంతి భద్రతలు, సుస్థిరతకు ఉగ్రవాదం సవాలుగా మారిందని జీ-8 ఉగ్రవాద వ్యతిరేక డిక్లరేషన్ పేర్కొంది. ఉద్దేశం ఏదైనా... ఉగ్రవాద చర్యలన్నీ నేరపూరితం, అమానవీయం, చట్ట వ్యతిరేకమని డిక్లరేషన్ స్పష్టం చేసింది.
- సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, సామర్థ్య నిర్వహణల విషయంలో పూర్తి సమన్వయం, సహకారం, బహుముఖ చర్యల ద్వారా ఉగ్రవాదాన్ని అరికట్టవచ్చని జీ-8 డిక్లరేషన్ పేర్కొంది. ఉగ్రవాద వ్యతిరేక ఒప్పందాలను, ప్రోటోకాల్స్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని జీ-8 దేశాధినేతలు ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు.
- పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్‌లలో ఉగ్రవాద హింసాత్మక చర్యలు తమదేశాల సుస్థిరతకు, భద్రతకు పెను సవాలుగా మారాయని జీ-8 దేశాలు పేర్కొన్నాయి. మాదకద్రవ్యాలు, అక్రమ వ్యాపారాలు, పేదరికం, ఆర్థిక ప్రగతిలో హెచ్చుతగ్గులు ఇందుకు ఊతమిస్తున్నాయన్నారు. పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్‌లలో సుస్థిరతకు, అభివృద్ధికి సహకరించేందుకు అన్ని రకాలుగా కట్టుబడి ఉన్నట్లు జీ-8 దేశాలు పేర్కొన్నాయి. నేరాలు, ఉగ్రవాద చర్యలను అరికట్టడం, మాదకద్రవ్యాల నియంత్రణ విషయంలో తమ సామర్థ్యాన్ని మరింతగా పెంపొందించుకునే దిశగా కృషి చేయనున్నట్లు తెలిపాయి.
- అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పదం(ఎన్‌పీటీ-నాన్ ప్రొలిఫిరేషన్ ట్రీటీ)పై సంతకాలు చేయాలని ప్రపంచ దేశాలను జీ-8 కోరింది. నిరాయుధీకరణకు, అణ్వస్త్రాల వ్యాప్తి నిరోధానికి వీలుగా ఎన్‌పీటీపై తక్షణమే సంతకాలు చేయాలని సూచించింది.
- ఎన్‌పీటీపై సంతకాలు చేయని దేశాలకు ''ఎన్‌రిచ్‌మెంట్ అండ్ రీప్రాసెసింగ్(ఈఎన్ఆర్)'' టెక్నాలజీ బదిలీపై నిషేధం పాటించేలా సభ్యదేశాలను జీ-8 అంగీకరింపచేసింది.

## ఈఎన్ఆర్.. భారత్‌పై ప్రభావం:

ఎన్‌పీటీపై సంతకాలు చేయని దేశాలకు ఈఎన్ఆర్ టెక్నాలజీని అందజేయరాదన్న జీ-8 నిబంధన... భారత్-అమెరికా పౌర అణు ఒప్పందంలో పేర్కొన్న పూర్తి అణు సహకారానికి వ్యతిరేకంగా ఉందని విశ్లేషకుల అభిప్రాయం. జీ-8 దేశాలు.. ఈఎన్ ఆర్ టెక్నాలజీ బదిలీపై ఎలాంటి నిషేధం విధించినా.. అది భారత మూడు దశల అణు కార్యక్రమంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపడం ఖాయమంటున్నారు. తన ఫాస్ట్‌బ్రీడర్ ప్రోగ్రాం రెండో దశ కోసం స్పెంట్ న్యూక్లియర్ ఫ్యూయల్‌ను ప్రాసెస్ చేసే హక్కు కావాలని భారత్ కోరుతోంది. తద్వారా యురేనియం స్థానంలో తన వద్ద సమృద్ధిగా ఉన్న థోరియంను వినియోగించాలని భావిస్తోంది. ఈ క్రమంలో.. రీప్రాసెసింగ్ ప్రక్రియలో భాగంగా వెలువడే ప్లుటోనియంను అణ్వాయుధాల తయారీకి బదిలీ చేసే ఆస్కారముందని కొన్ని దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఈఎన్ఆర్ టెక్నాలజీ బదిలీకి సంబంధించి జీ-8 తాజా నిబంధనతో భారత్ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని కేంద్ర ప్రభుత్వం, రాజ్యసభకు తెలిపింది. ఈఎన్ఆర్ విషయంలో

అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ), న్యూక్లియర్ సప్లయ ర్స్ గ్రూప్(ఎన్ఎస్‌జీ) నుంచి భారత్‌కు ప్రత్యేక మినహాయింపులున్నాయని ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ సభకు వెల్లడించారు.

## జీ-8, జీ-5... సంయుక్త ప్రకటన:

మొదటిసారిగా జీ-8, జీ-5 సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. జర్మనీలోని హెలిజెండమ్‌లో 2007లో ప్రారంభించిన జీ-8, జీ-5 చర్చల ప్రక్రియను కొనసాగించాలని నిర్ణయించాయి. ఈ ప్రక్రియను హెలిజెండమ్-లాక్విలా ప్రాసెస్(హెచ్ఏపీ)గా పేర్కొ న్నాయి. దీన్ని సమ భాగస్వామ్య చర్చల ప్రక్రియగా అభివర్ణించారు. ముస్కోకాలో జరిగే తదుపరి జీ-8, జీ-5 సదస్సు నివేదికను స్టీరింగ్ కమిటీ రూపొందించనుంది.

- 2010లో ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) దోహా రౌండ్ చర్చలకు సముచిత ముగింపు అవసరమని జీ-8 డిక్లరేషన్ పేర్కొంది. వాషింగ్టన్, లండన్‌లలో జరిగిన జీ 20 సదస్సుల నిర్ణయాలను వేగంగా అమలు చేసేలా జీ-8, జీ-5 సంయు క్తంగా కృషిచేయాలని సూచించింది.
- క్లీన్, లో కార్బన్ టెక్నాలజీల బదిలీ ద్వారా.. వాతావరణంలోకి కార్బన్ ఉద్గారాలను తగ్గించి, తద్వారా ఇంధన సామర్థ్యాన్ని పెంచడంవంటి వాటిపై జీ-8, జీ-5 సంయుక్తంగా దృష్టిసారించాలని ఉమ్మడి డిక్లరేషన్ అభిప్రాయపడింది.
- ప్రస్తుత ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా.. ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణల ప్రక్రియను వేగవంతం చేసేందుకు జీ-8, జీ-5 దేశాలు కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది.

## జీ-5 సమాంతర సదస్సు:

- జీ-5 సమాంతర సదస్సు ఒక రాజకీయ డిక్లరేషన్‌ను, మరొక వాణిజ్య డిక్లరేషన్‌ను విడుదల చేసింది.
- పారిశ్రామిక దేశాలు ఆర్థిక రక్షణ విధానాలను మానుకుని.. ఫైనాన్షియల్, క్రెడిట్ సరఫరాకు సంబంధించి తమ కమిట్ మెంట్స్‌ను అమలుచేయాలని డిక్లరేషన్ సూచించింది.
- జీ-8, జీ-5 గత సదస్సు ఒప్పందాలను.. ముఖ్యంగా లండన్‌లో జీ 20 సదస్సులో సభ్యదేశాలు అంగీకరించిన అంశాలను అమల్లోపెట్టాలని జీ-5 డిక్లరేషన్ పేర్కొంది. ప్రపంచ ఆర్థిక మాంద్యం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు క్రెడిట్ పంపిణీ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలంది.
- అభివృద్ధి చెందుతున్న దేశాలకు అంతర్జాతీయ మార్కెట్‌లు అందుబాటులోకి వచ్చేవిధంగా.. దోహా రౌండ్ చర్చలను పూర్తిచేయాలని ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) సభ్యదేశాలకు జీ-5 సమాంతర డిక్లరేషన్ పేర్కొంది.
- డిసెంబర్, 2009 నాటికి కోపెన్‌హెగన్‌లో వాతావరణ మార్పులపై చర్చలు ముగిసేలా చూడాలని.. అభివృద్ధి చెందిన దేశాలు 2020 నాటికి 1990 స్థాయిలో.. కనీసం 40 శాతం మేర తమ కాలుష్య కారకాలను తగ్గించుకోవాలని పేర్కొంది!!